సాక్షి ఒడిశా


ఆదివారం । 17 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ.6,90,467
బంగారం : 6 గ్రాముల 980 మిల్లీ గ్రాములు
వెండి : 37 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



వైభవంగా నందోత్సవం

పూరీ శ్రీమందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.

- 8లో



ఎడతెరిపి లేకుండా వర్షం

మల్కన్‌గిరి జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది.

- 8లో

అల బృందావనంలో..!



పర్లాకిమిడి: కన్నయ్య వేషధారణలో బాలుడు



పర్లాకిమిడి: రాధ వేషధారణలో బాలిక



పర్లాకిమిడి: ప్రత్యేక అలంకరణలో జగన్నాథుడు



భువనేశ్వర్: బాల మురళీ కృష్ణుడు



రాయగడ: ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

నల్లనయ్య జన్మాష్టమి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. కన్నయ్య, గోపికల వేషధారణల్లో చిన్నారులు ముద్దులొలికించారు. గోవర్ధన గిరిధారికి భక్తులంతా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: రాధాకృష్ణుల వేషధారణలో బాలలు



జయపురం: రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



జయపురం: బాల కృష్ణుడిని ఊయలలో ఊపుతున్న భక్తులు



భువనేశ్వర్: జాజ్‌పూర్ ఉత్తరాది వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక పారాయణం



భువనేశ్వర్: ఉట్టు కొట్టుడు ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: ఇస్కాన్ మందిరంలో జన్మాష్టమి వేడుకలు



రాయగడ: రాధాకృష్ణుల వేషధారణల్లో చిన్నారులు

న్యూస్‌రీల్

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



శ్మశానవాటికలో మొక్కలు నాటుతున్న మహిళలు

రాయగడ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మహిళలు అన్నారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ శ్మశానవాటికలో సామాజిక కార్యకర్త చలపతిరావు అధ్వర్యంలో మొక్కలను శనివారం నాటారు. ఔషధ మొక్కలతో పాటు నీడనిచ్చే సుమారు 200 మొక్కలను నాటారు. మొక్కల ఆవశ్యకత గురించి మహిళలకు చలపతిరావు అవగాహన కలిగించారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకోవాలని సూచించారు.

విక్రమదేవ్ వర్మ విగ్రహం ఏర్పాటు చేయండి



మహారాజు విక్రమదేవ్ వర్మ

జయపురం: బహుముఖ ప్రజ్ఞాశాలి, జయపురం మహారాజు రాజర్షి విక్రమదేవ్ వర్మ విగ్రహాన్ని రాష్ట్ర విధాన సభా ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని జయపురం సాహిత్య పరిషత్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం మోహన్ చరణ్ మాఝికి ఒక లేఖను పంపించారు. అవిభక్త కొరాపుట్‌ను మొదట నందపూర్ రాజధానిగా జయపురం రాజులు పాలించారన్నారు. జిల్లా అభివృద్ధికి విక్రమదేవ్ వర్మ ఎంతో కృషి చేశారని తెలియజేశారు. అయితే ఆయనకు తగినంత గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన ఇప్పటికైనా విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్య శిబిరం



విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక గాయత్రీనగర్ సరస్వతీ శిశు మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. శిశు మందిరంలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా కంటి, దంత వైద్య పరీక్షలను చేపట్టారు. మొత్తం 182 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించగా, వారిలో 122 మందికి దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా మరో 60 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ సాహు నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో సాయి భక్తులు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతబడి నెపంతో యువకుడి హత్య



రామారావు జిలకర్ర (ఫైల్)

రాయగడ: చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో ఒక యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన జిల్లాలోని శిఖాల్ పోలీస్‌స్టేషన్ పరిధి బొడొఅలుబడి పంచాయతీలోని గురుసిబడి గ్రామంలో చోటు చేసుకుంది. యువకుడికి గ్రామంలోని కొందరు బలవంతంగా విషం తాగించి హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని గ్రామ సమీపంలో తగులబెట్టారు. ఈ ఘటన అలస్యంగా వెలుగుచూసింది. తన అన్నయ్యను కొందరు గ్రామస్తులు హత్య చేశారని మృతుని తమ్ముడు శిఖాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ మేరకు 13 మందిని అరెస్టు చేసి శనివారం కోర్టుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. గురుసిబడి గ్రామంలో నివసిస్తున్న రామారావు జిలకర (20) అనే యువకుడు గత కొన్నాళ్లుగా చేతబడి చేస్తున్నాడని గ్రామంలోని కొందరు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులంతా ఏకమై ఒకరోజు నిర్వహించిన గ్రామసభలో చేతబడి చేసి, గ్రామంలో అశాంతిని నెలకొల్పుతున్న రామారావును ఎలాగైన హత్య చేయాలని సంకల్పించుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 8వ తేదీన రామారావును కొందరు యువకులు మాటల్లో పెట్టి ఒక పానీయంలో విషం కలిపి బలవంతంగా తాగించి దారుణ హత్యకు పాల్పడ్డారు. అనంతరం మృతి చెందాడని నిర్ధారించుకొని మృతదేహాన్ని గ్రామ సమీపంలో పెట్రోల్ పోసి తగులబెట్టారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

జయపురం: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోట్‌పాడ్ ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర అన్నారు. జయపురం సమితి కోట్‌పాడ్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిషా నివారణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల వలన కుటుంబాలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత తప్పటడుగులు వేస్తున్న పరిణామం సమాజానికి చేటు అన్నారు. అందువలన మత్తు పదార్థాలపై గ్రామాల్లో విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పాణిరో సాగర్, ఉపాధ్యాయులు సుజిత్ సర్కార్, రౌతికాంత మహంతి, మహిమ ముండ, శుభాషిష్ పండ, ఆకాశ బిబార్, ప్రభాషిణీ లామాల్, దమయంతి సాహు, సయిత గౌలారి తదితరులు పాల్గొన్నారు.

మద్యం కోసం దారుణం

- భార్యను హత్య చేసిన భర్త



భారతి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తెలు, ఇతర బంధువులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 79 పోలీసుస్టేషన్ పరిధి భువనపల్లి పంచాయతీ గిన్నిపల్లి గ్రామంలో భీమ కుంజ అనే వ్యక్తి భార్య భారతి కుంజ (40)ను శనివారం దారుణంగా హత్య చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. భీమ తన పొలంలో వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలో నివసిస్తున్నాడు. అతడు కొద్ది రోజులుగా నిత్యం మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడుతూ కొడుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం భారతి పనికి వెళ్తూ భర్త తీసుకొచ్చిన మద్యం అతడికి దొరకకుండా దాచిపెట్టింది. అది తెలుసుకున్న భీమ పొలం వద్దకు వచ్చి మద్యం ఎక్కడ దాచావని అడుగుతూ భార్యను కొట్టాడు. అయినా ఆమె చెప్పకపోవడంతో అక్కడే ఉన్నటువంటి కత్తితో పొడిచి చంపేశాడు. ఆమె కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అక్కడికి వచ్చారు. అయితే ఎవరైనా సాక్ష్యం చెబితే వారిని సైతం చంపుతానని భయపెట్టాడు. చివరికి గ్రామస్తులంతా కలిసి అతడిని పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ఎమ్మెల్యే తారాప్రసాద్‌పై దాడి



ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



దాడి చేసిన కృష్ణ కులదీప్

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీకి చెందిన జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతిపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 14వ తేదీన రాత్రి కొరాపుట్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే తారాప్రసాద్ పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ మీదుగా ర్యాలీ కొనసాగుతుండగా.. అదే సమయంలో అకస్మాత్తుగా అక్కడి బస్టాండ్‌లో కళాసీల సంఘం అధ్యక్షుడు కృష్ణ కులదీప్ అక్కడికి చేరుకున్నాడు. ఆయన ఒక్కసారిగా ఎమ్మెల్యేపై దాడి చేశాడు. దీంతో ఎమ్మెల్యే కుప్పకూలిపోయాడు. అప్రమత్తమైన కాంగ్రెస్ కార్యకర్తలు వెంటనే కృష్ణ కులదీప్‌ను చితకబాదారు. ఎమ్మెల్యే గన్‌మెన్ అతనిపై కొరాపుట్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. మరోవైపు నిందితుడు కూడా పోలీస్‌స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేశాడు. తనపై ఎమ్మెల్యే తారాప్రసాద్‌తో పాటు అతని సోదరులు హత్యాయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాయగడలో 'చదువుకుందాం రండి'



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు డ్రాపౌట్ల సంఖ్యను తగ్గించేందుకు శ్రీకారం చుట్టింది. అందరికీ విద్య, అందరూ చదువుకోవాలి అనే నినాదంతో పట్టణంలోని ఇందిరానగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో చదువుకుందాం రండీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మెట్రిక్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వెల్లడి

గ్రేడుల వారీగా ఉత్తీర్ణులు

గ్రేడ్	ఉత్తీర్ణులు
ఏ-2	13
బీ-1	232
బీ-2	723
సీ	1,738
డీ	2,075
ఈ	1,192

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శనివారం వెల్లడించారు. ఈ పరీక్షలు రాసిన 3,457 మంది విద్యార్థుల్లో, 1,944 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత రేటు 56.23గా నమోదు అయింది. ఈ ఫలితాలతో పాటు రాష్ట్ర ఓపెన్ స్కూల్ (ఎస్ఓఎస్) పరీక్ష ఫలితాలను వెల్లడించారు. 10,809 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా, 5,973 మంది ఉత్తీర్ణత సాధించారు. 55.26 శాతం ఉత్తీర్ణత నమోదు అయింది.

శ్రీమందిరం శిఖరం ఎక్కేందుకు ప్రయత్నం



పోలీసుల అదుపులో యాత్రికులు

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం శిఖరంపైకి ఎక్కేందుకు ప్రయత్నించిన యాత్రికుడు పోలీసులకు పట్టుబడ్డాడు. బెహరాణా ద్వారం వైపు నుంచి శిఖరం పైకి ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా శ్రీజగన్నాథ ఆలయం పోలీసుల (ఎస్‌జేటీపీ) దృష్టిలో పడింది. దాదాపు 5 నుంచి 7 అడుగుల వరకు పైకి ఎక్కిన తర్వాత అతడిని గుర్తించారు. ఈ యాత్రికుడు బీహార్ (రాంచీ)కు చెందినవాడిగా కనుగున్నారు. స్థానిక సింహద్వారం ఠాణా పోలీసుల అదుపులో ఉన్నాడు.

ఆదుకోండయ్యా..!



తల్లి ఒడిలో రోదిస్తున్న బాలిక తనీస

జయపురం: అగ్ని ప్రమాదంలో గాయపడిన తన రెండేళ్ల కుమార్తె తనీస హికాకి చికిత్స కోసం దాతలు సహకరించాలని ఆ బాలిక తండ్రి మీనా హికాక కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొరాపుట్ జిల్లా లమతాపుట్ సమితి ఒడియపెంట పంచాయతీ తొలకాయిపాదర్ గ్రామంలో ఈనెల 5వ తేదీన మీనా హికాక ఇంటి సమీపంలోని కాలువలో పిల్లలు స్నానం చేశారు. అనంతరం చలిగా ఉందని మంట వేసుకొని చలి కాగుతున్నారు. ఆ సమయం అకస్మాత్తుగా తనీసకు మంటలు అంటుకున్నాయి. స్థానికులు స్పందించి వెంటనే మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే తనీస శరీరం బాగా కాలిపోయింది. వెంటనే తల్లిదండులు బాలికను లమతాపుట్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. అక్కట ప్రాథమిక చికిత్స చేసిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం కొరాపుట్ సాహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అయితే 8 రోజుల పాటు అక్కడ చికిత్స అందించినా బాలిక పరిస్థితిలో మార్పు రాకపోవడంతో బరంపురం గానీ కటక్ గానీ తీసుకెళ్లమని డాక్టర్లు సూచించారు. కానీ డబ్బులు లేకపోవడంతో తమ కుమార్తెను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా ఇంటి వద్దనే ఉంచారు. తాను చిన్న రైతునని, ఐదుగురు పిల్లలతో కష్టం మీద జీవనం సాగిస్తున్నానని తండ్రి వాపోతున్నారు. దాతలు సహకరించి తమ కుమార్తెను కాపాలని కోరుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు



ఆస్పత్రిలో తనిఖీలు చేపడుతున్న అధికారులు

రాయగడ: జిల్లాలో గుణుపూర్‌లోని కపిల్‌పూర్ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ బి.సరోజిని దేవి, జిల్లా అదనపు ముఖ్య వైద్యాధికారి డాక్టర్ మమత సాహులతో పాటు గుణుపూర్ ఎస్డీపీవో బబులి నాయక్, పద్మపూర్ తహసీల్దార్ శంకర్ బాగ్, గుణుపూర్ అగ్నిమాపక కేంద్రాధికారి రజనీకాంత్ గౌడా తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. లక్ష్మణ్ లావణ్య మాతృ చికిత్సాలయం, రీసెర్చ్ కేంద్రం పేరిట నిర్వహిస్తున్న ఈ ఆస్పత్రిపై పలు ఆరోపణలు అధికారుల దృష్టికి రావడంతో ఈ దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో పలు కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అమాయక ఆదివాసీ గర్భిణులు చికిత్స కోసం వస్తే వారి వద్ద నుంచి ఫీజుల పేరిట అధిక డబ్బులు గుంజుతున్నారని ఆరోపణల మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిసింది. కాగా గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రదీప్ కుమార్ పండ ఆధ్వర్యంలో ఈ ఆస్పత్రి నడుస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



కపిల్‌పూర్‌లోని ఆస్పత్రి ఇదే...

క్లుప్తంగా

కొత్త ఎన్ఏసీల ముసాయిదా ఉత్తర్వులు జారీ

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్తగా 12 నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్స్ (ఎన్ఏసీ) ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు పట్టణాభివృద్ధి శాఖ ముసాయిదా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో అంగుల్ జిల్లాలోని పల్లోలోహడా, సువర్ణపూర్ జిల్లాలోని బీర మహరాజ్‌పూర్, బాలాసోర్ జిల్లాలో బొస్తా, సిములియా, మయూర్‌భంజ్ జిల్లాలో బెట్నొటి, బంగిరిపోషి, చిత్తారా, రాయగడ జిల్లాలోని బిసంకటక్, సంబల్‌పూర్ జిల్లాలో రెంగాలి మరియు బమ్రా, భద్రక్ జిల్లాలో తిహిడి, ధుసురి చోటు దక్కించుకున్నాయి.

సైనికుడి వీరమరణం

భువనేశ్వర్: జమ్మూ – కాశ్మీర్ కిస్త్వార్‌లో కొండ చరియలు విరిగిపడి ఒడియా సైనికుడు మృతి చెందాడు. అమర జవాను అంగుల్ జిల్లా రాఖికమార్ గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ బిస్వాల్‌గా గుర్తించారు.

ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎచ్చెర్లలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఐటీఐ, స్కిల్ హబ్ సెంటర్లలో ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులకు శిక్షణను అందించనున్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు తెలిపారు. టెన్త్ ఆపై విద్యార్హత కలిగిన 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన యువకులు అర్హులని చెప్పారు. శిక్షణ పూర్తిచేసినవారికి సర్టిఫికెట్‌తోపాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని సుధాకర్ పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హత తెలుపు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, 2 పాస్‌ఫొటోలతో ఆగస్టు 20వ తేదీలోపు ఎచ్చెర్ల స్కిల్‌హబ్ సెంటర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 7989177887 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

షాపు తెరవనే లేదు.. అయినా రూ.7వేల బిల్లు

టెక్కలి: తాను షాపు తెరవకపోయినా రూ.7,240ల విద్యుత్ బిల్లు వచ్చిందంటూ టెక్కలి పాత పెట్రోల్ బంక్ ఎదురుగా వాటర్ సర్వీసింగ్ సెంటర్ యజమాని కురుమోజు తేజ వాపోయాడు. తన చేయి విరిగిపోవడంతో గత రెండు నెలలుగా షాపు తెరవడం లేదని, అయినప్పటికీ స్మార్ట్ మీటర్ పుణ్యమా అని వేల రూపాయల విద్యుత్ బిల్లు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతకు మునుపు ప్రతి నెల రూ.700 లోపు బిల్లు వచ్చేదని వివరించాడు. స్మార్ట్ మీటర్ అమర్చిన కొత్తలో రూ.78 వేల బిల్లు వచ్చిందని, దీనిపై అధికారుల ఫిర్యాదు చేయగా రూ.700 బిల్లుకు అదనంగా మరో రూ.700 వేసి రూ.1400 వసూలు చేశారని తెలిపారు. అత్యధికంగా బిల్లుల మోత మోగిస్తున్న స్మార్ట్ మీటర్‌ను తక్షణమే తొలగించి తనకు వచ్చిన బిల్లును తగ్గించాలని కోరాడు.

విజిలెన్స్ కమిషనర్‌కు సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ అనిలచంద్ర పునేఠా శనివారం కలెక్టర్ బంగ్లా వద్ద పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో కె.సాయిప్రత్యూష, ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, రామలింగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న పోరాటాలు భావితరాలకు తెలియాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం శ్రీకాకుళం డే అండ్ నైట్ కూడలి వద్ద ఆయన విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజిలతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ వేడుకలుగా గుర్తించి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, చౌదరి బాబ్జీ, రమణమాదిగ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు, డీటీసీడబ్ల్యూఓ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వజ్రపుకొత్తూరు: పూండి రైల్వే స్టేషన్ యార్డు సమీపంలో పట్టాలపై శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు జీఆర్‌పీ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. మృతుడు గులాబీ టీ షర్టు, సిమెంట్ కలర్ షార్టు ధరించి ఉన్నాడని, గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతిచెంది ఉంటాడని చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్‌పీ నెంబరు 9440627537కు తెలియజేయాలని కోరారు.

వైభవంగా నందోత్సవం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీకృష్ణుని జననం మొదలుకొని తదనంతర ఘట్టాల్ని ఉత్సవ భరితంగా నిర్వహించడం విశేషం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను రంగరించుకున్న నందోత్సవం శ్రీమందిరం ప్రాంగణంలో శ్రీ కృష్ణ భగవానుని జననం దైవిక ఆనందాన్ని ప్రతిధ్వనింపజేస్తుంది. ఈ క్రమంలో శనివారం నందోత్సవం ఆలయ ఆచార సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. శ్రీమందిరం ఆచారం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి జన్మాష్టమి జరుపుకున్నారు. అర్ధరాత్రి 12.35 గంటల వరకు శ్రీకృష్ణ జననం, 1.45 గంటల నుంచి 2.05 గంటల వరకు నాభి కోత కార్యక్రమం నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం జగన్నాథ ఆలయంలో సంధ్యా హారతి తర్వాత నందోత్సవ ఆచారాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాజన్ సేవాయత్‌లు శ్రీమందిరం దక్షిణ గృహం నుంచి రామ, కృష్ణ మరియు మదన మోహనుని ఉత్సవ విగ్రహాలను ఉత్సవంగా తీసుకువచ్చి జగమోహన మండపంపై ఊయలలో ఆసీనం చేశారు. అనంతరం మైలం మరియు ఇతర ఆచారాల తర్వాత జగన్నాథుడు మరియు సుభద్ర దేవి యొక్క దివ్య సన్నిధిలో శతి మరియు మార్కండి పూజలు నిర్వహించారు. దుర్గాదేవి ఉత్సవ ప్రతిమని భాండాగారం నుంచి తీసుకువచ్చి రామ, కృష్ణ మరియు మదన మోహనుని సరసన ఊయలలో ఉంచి పూజాదులు నిర్వహించారు. శ్రీ కృష్ణుని జననం తర్వాత కంసునికి ఆకాశవాణి సందేశ ఘట్టం ఈ ఉత్సవంలో ప్రత్యేకత సంతరించుకుంది. ఆకాశవాణి ఘట్టం ముగియడంతో డోలికలో ఉత్సవమూర్తులను 7 మెట్ల ద్వారం ఆవరణకు తరలించి శిశువు కృష్ణ భగవానుడికి శ్రీమహాలక్ష్మి సమక్షంలో పితికిన పాలని వెండి పాత్రలో సమర్పించారు. ఈ ఉత్సవంలో నంద రాజు వేషధారణలో భిత్తారొచ్చా మహాపాత్రో సేవకుడు, అతని కుమారులు తదితర పరివారం సభ్యుల పాత్రధారణలో 20 మంది పైబడి సేవకులు పాలుపంచుకున్నారు. భాద్రపద కృష్ణపక్షం దశమి నాడు శ్రీమందిరం రత్న వేదికపై వనభోజి అలంకరణ, కొలివిక, బకాసుర మరియు అఘాసుర వధ ఉత్సవాలు జరుగుతాయి.

రఘు మౌసా ఇక లేరు



భువనేశ్వర్: కటక్ మహానగరం దొహి బొరా, ఆలూ దమ్ (పెరుగు గారె, బంగాళ దుంప కూర)కు ప్రసిద్ధి చెందింది. ఒడియా రుచికరమైన కాలక్షేప తినుబండారాల్లో ఈ వంటకం రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు సాధించింది. కటక్ నగరం సందర్శించే పర్యాటకులు సైతం దీని కోసం ఉత్సాహం చూపిస్తారు. దొహి బొరా, ఆలూ దమ్ ప్రియులకు దీని ఆవిష్కర్త రఘునాథ్ సన్మల్ రఘు మౌసాగా ప్రాచుర్యం పొందాడు. అయితే 91 సంవత్సరాల వయసులో శనివారం బిడానాసి గోపాల్ సాహిలో తన నివాసంలో వృద్ధాప్య అనారోగ్యంతో కనుమూశారు. 1950లో తన 15 సంవత్సరాల వయసులో ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. ఒక యుగం ముగిసిందని సర్వత్రా విచారం వ్యక్తం అవుతుంది. రఘు మౌసా ప్రత్యేక వ్యవహార శైలి స్థానికులు, పర్యాటకులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకునేది. సహజమైన దినుసులతో వండి సిద్ధం చేసిన కూరతో



రఘు మౌసా విక్రయ కేంద్రం దగ్గర నిత్యం ఉండే జనం(ఫైల్)

కూడిన పెరుగు గారె ఎవరైనా చెంచా లేకుండా ఆకుతో కుట్టిన దోనలో చేతితో తినాల్సిందే. ఈ వంటకానికి సేవ్, పచ్చి ఉల్లి వగైరా అదనపు జోడింపులు లేకుండా సహజ రుచులతో నిండిన దొహి బొరా, ఆలూదమ్ కోసం వేచి ఉండేవారు. అమ్మకం ప్రారంభించిన ఒక్క గంటలో అమ్ముడుపోయేది. అయితే అతడు మరణించడంతో అందరూ విచారం వ్యక్తం చేస్తున్నారు. అతని భౌతిక కాయానికి నివాళులర్పించారు.

ఎడతెరిపి లేకుండా వర్షం



వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు

- రాకపోకలకు అంతరాయం

మల్కన్‌గిరి: జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో కలిమెల సమితి ఎంవీ 96 వంతెనపై శనివారం ఉదయం సుమారు 3 అడుగుల మేరకు వరద నీరు ప్రవహించింది. దీంతో మల్కన్‌గిరి నుంచి కలిమెల మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వెళ్లే బస్సులు వంతెన వద్దనే నిలిపివేశారు. అలాగే హైదరాబాద్ నుంచి వస్తున్న బస్సులు, భువనేశ్వర్ నుంచి మోటు వైపు వెళ్లే బస్సులను సైతం నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



వంతెన వద్ద నిలిచిపోయిన వాహనాలు, ప్రజలు

డేటా ఎంట్రీ ఆపరేటర్ అనుచిత ప్రవర్తన

శ్రీకాకుళం : శ్రీకాకుళం రిమ్స్ సర్వజన ఆస్పత్రిలోని పలమనాలజీ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి.. తోటి మహిళా ఉద్యోగిపై అనుచితంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై రిమ్స్ అధికారులు తూతూమంత్రపు చర్యలతో సరిపెట్టారు. సదరు డేటా ఎంట్రీ ఆపరేటర్ పలమనాలజీ విభాగంలో వైద్యునిగా ఉన్న వ్యక్తిపై కూడా దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. వీరిద్దరూ వేర్వేరుగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రిమ్స్ అధికారులు విచారణ కోసం ఐదుగురు సభ్యులతో కమిటీ వేశారు. ఇందులో వైద్యులతో పాటు అడ్మినిస్ట్రేటర్ కూడా విచారణాధికారిగా పాల్గొన్నారు. కమిటీలోని సభ్యులకు నామమాత్రపు చాన్స్ ఇచ్చిన అడ్మినిస్ట్రేటర్ అంతా తానై వ్యవహరించి విచారణ పూర్తి చేశారు. విచారణ సమయంలోనూ డేటా ఎంట్రీ ఆపరేటర్ చేసిన వ్యాఖ్యానాలు సరిగా లేవని విచారణలో పాల్గొన్న వైద్యులే చెబుతున్నారు. తమకు నామమాత్రపు అవకాశం ఇచ్చారని, ఈ కారణంగా తామేమీ మాట్లాడలేకపోయామని అంటున్నారు. అనుచితంగా, దురుసుగా ప్రవర్తించిన ఉద్యోగి వల్ల తనకు హాని ఉందని వైద్యుడు విచారణ అధికారుల ఎదుట చెప్పగా, తనది కూడా సేమ్ ఫీలింగ్ అని విచారణలో పాల్గొన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ అన్నట్లు విచారణ సభ్యులే బహిరంగంగా చెబుతున్నారు. ఇలా వ్యవహరించిన ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోకుండా వేరొక విభాగానికి మార్చడాన్ని రిమ్స్ ఉద్యోగులు వైద్యులు తప్పుపడుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి

శ్రీకాకుళం: ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలుచేయాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారు పోతల దుర్గారావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీ ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు శుక్రవారం రాత్రి కోరుకొండ సమితి నీలాద్రినగర్ పంచాయతీ సోరలకొండ బ్యారేజీ వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక బైక్‌పై ఇద్దరు వ్యక్తులు అతివేగంగా రావడం గమనించి వారితో ఉన్నటువంటి బ్యాగును తనిఖీ చేశారు. తనిఖీల్లో గంజాయి బయటపడడంతో వారిని అరెస్టు చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మల్కన్‌గిరి సమితి ఎంవీ 25 గ్రామానికి చెందిన రాఖల్ వాలా, జ్యూటిపల్లి గ్రామానికి చెందిన భీమా పోడియామిలుగా తెలిపారు. వీరు ఈ గంజాయిని ఎంవీ 120 గ్రామంలో కొని మల్కన్‌గిరికి తరలిస్తున్నట్లు తెలిపారు. గంజాయిని తూకం వేయగా 7 కిలోలు ఉందని, దీని విలువ రూ.50 వేలు వరకు ఉంటుందని బలిమెల ఐఐసీ ధీరాజ్ పట్నాయిక్ వెల్లడించారు. నిందితులను సోమవారం కోర్టుకు తరలిస్తామన్నారు.



గంజాయితో పట్టుబడిన నిందితులు

సింద్రుబ గ్రామానికి ఎమ్మెల్యే రూపేష్



గ్రామస్తులతో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గుమ్మా బ్లాక్‌లోని భుభుని పంచాయతీ మారుమూల సింద్రుబ గ్రామంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి పర్యటించారు. గ్రామంలోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. 2019లో వచ్చిన తుఫాన్ ప్రభావంతో కొండచరియలు విరిగిపడి గ్రామంలోని అనేక ఇల్లు నేలమట్టం అయ్యాయి. గ్రామంలో ప్రస్తుతం 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కానీ తాగు నీరు, రోడ్డు, పాఠశాల సౌకర్యం లేకపోవడంతో ఎమ్మెల్యే రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. గ్రామంలో త్వరితగతిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు గుమ్మా బీడీవో దులారాం మరాండి, గుమ్మా బ్లాక్ చైర్మన్ సునేమీ మండల్, బీజేడీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ నాయక్ తదితరులు ఉన్నారు.



గ్రామానికి నడిచి వెళ్తున్న ఎమ్మెల్యే రూపేష్

వాజపేయికి నివాళి



రాయగడ: వాజపేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొండబాబు తదితరులు

రాయగడ: భారత మాజీ ప్రధానమంత్రి దివంగత అటల్ బిహారి వాజపేయి వర్ధంతి కార్యక్రమం బీజేపీ శ్రేణులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు కీర్తిచంద్ర సాహు, బాదల్ ద, బీజేపీ నాయకుడు యాళ్ల కొండబాబు, బసంత ఉల్కా, కలిరామ్ మాఝి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: ఇరదలవీధి బీజేపీ కార్యాలయంలో..

పర్లాకిమిడి: స్థానిక ఇరదల వీధిలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి నిర్వహించారు.

వాజపేయి దేశానికి చేసిన సేవలను సీనియర్ నాయకుడు ఛిత్రి సింహాద్రి కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీ ప్రతినిధి దారపు చిట్టి, కోట్ల యువరాజ్, సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, కృషక్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ పాలో తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో శ్రీమందిరం పాలక మండలి

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుడు కొలువుదీరిన శ్రీమందిరం పాలక మండలి వారం రోజుల్లో ఏర్పాటు అవుతుందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. ఈ కమిటీ ఏర్పడిన తర్వాత ఉన్నత స్థాయి కమిటీ సమావేశం అవుతుంది. వెంబడి రత్న భాండాగారం సంపదను లెక్కించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇద్దరు సీనియర్ భారత రిజర్వు బ్యాంకు అధికారుల సమక్షంలో ఈ లెక్కింపు జరుగుతుందని న్యాయశాఖ మంత్రి తెలియజేశారు.

భోజనాలకు అప్పులు..
నిర్వాహకులకు తిప్పలు



కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న వంట ఏజెన్సీ సభ్యులు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు అందని బిల్లులు
- గౌరవ వేతనాలు సైతం చెల్లించని పాలకులు
- ఎనిమిది నెలలుగా తప్పని అవస్థలు

కొత్తూరు: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బిల్లులు అందక వంట ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నా బిల్లులు మంజూరు కావడం లేదని, కనీసం గౌరవ వేతనం సైతం అందడం లేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాది జనవరి నుంచి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 30 మండలాల్లో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో భోజన పథకం అమలు చేస్తున్నారు. విద్యార్థులకు వంట చేసి భోజనం పెట్టేందుకు 150 మంది మధ్యాహ్న భోజన కార్మికులను నియమించారు. వీరు సుమారు 12800 మంది విద్యార్థులకు భోజనాలు వండి పెడుతున్నారు. ఒక్కో విద్యార్థి భోజనానికి ప్రభుత్వంరూ.9.27 పైసలు చెల్లించాల్సి ఉంది. అదే విధంగా, నిర్వాహకులకు గౌరవ వేతనం కింద ఒక్కొక్కరికి నెలకు రూ.3వేలు చెల్లించాల్సి ఉంది. అయితే పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇంతవరకు చిల్లిగవ్వ కూడా చెల్లించలేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకులు

అప్పు చేసి పప్పుకూడు..

బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసి వండి పెట్టాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. కూరగాయలు, పప్పు, నూనె, కిరాణా సామగ్రితో పాటు వంట చెరుకులు నిత్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని ఆశతో అప్పులు చేస్తున్నామని, అయితే ఇంత వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం సబబు కాదని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులు ఆకాశాన్నంటుతుండటంతో వాటిని కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

త్వరలోనే చెల్లిస్తాం..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బడ్జెట్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మరో వారం రోజుల్లో వంట ఏజెన్సీ సభ్యులకు బిల్లులతో పాటు గౌరవ వేతనాలు జమవుతాయి.

– పి.దుర్గారావు, ఆర్ఐఓ, శ్రీకాకుళం

గౌరవ వేతనమేదీ?

పథకం ప్రారంభమై ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంత వరకు ప్రతినెలా చెల్లించాల్సిన గౌరవ వేతనం రూ.3వేలు అందించకపోవడం తగదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట నిర్వహణ కారణంగా ఇతర కూలి పనులకు కూడా వెళ్లలేకపోతున్నామని అంటున్నారు. ఉపాధి పనులకు వెళ్లినా రోజుకు రూ.250 వస్తుందని, కాలేజీలో వండి పెడితే రోజుకు వంద రూపాయలు కూడా రావడం లేదని, అది కూడా ప్రతి నెలా చెల్లించకపోవడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిల్లులతో పాటు గౌరవ వేతనం తక్షణం చెల్లించాలని వంట నిర్వాహకులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు..



ఎనిమిది నెలలుగా బిల్లులు చెల్లించక పోవడంతో అప్పులు చేసి వంటలు చేయాల్సి వస్తోంది. గౌరవ వేతనాలు కూడా ఇంతవరకు చెల్లించలేదు. అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నాం. ఇతర పనులకు వెళ్లలేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

– ఎ.సుందరమ్మ, వంట ఏజెన్సీ సభ్యురాలు, కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఎనిమిది నెలలుగా..



వంట ఏజెన్సీ సభ్యులుగా చేరడం వల్ల ఉపాధి పనులకు రానివ్వడం లేదు. వంట సభ్యులుగా చేరి ఎనిమిది నెలలు గడుస్తున్నా బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించడం లేదు. అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నాం. బిల్లులు ప్రభుత్వం చెల్లించిన వడ్డీలకు సరిపోయేలా లేవు.

– కె.కన్నెమ్మ, వంట ఏజెన్సీ సభ్యురాలు, కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

బాక్సింగ్ భార్గవ్

- జూనియర్ ఇండియన్ బాక్సింగ్ టోర్నీలో కాంస్య పతకం సాధించిన సత్యభార్గవ్
- ఇండియన్ కోచింగ్ క్యాంపునకు ఎంపిక
- భారత జట్టుకు ఎంపిక కావడమే లక్ష్యంగా సాధన



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నుంచి అభినందనలు అందుకుంటూ..

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు యువ బాక్సింగ్ సంచలనం గంధం సత్యభార్గవ్ ఆకాశమే హద్దుగా రాణిస్తున్నాడు. ఇప్పటికే అనేక టోర్నమెంట్లలో సత్తాచాటిన భార్గవ్ ప్రతిష్టాత్మక ఆలిండియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకంతో మెరిశాడు. దీంతో హర్యానాలోని రోతక్ వేదికగా ఆగస్టు 2 నుంచి 15వ తేదీ వరకు జరిగిన ఇండియన్ కోచింగ్ క్యాంప్‌కు ఎంపికయ్యాడు. రెండు వారాలపాటు శిక్షణ పాఠాలు నేర్చుకున్న భార్గవ్ క్యాంప్ ముగించుకుని జిల్లాకు పయనమయ్యాడు. ఇండియన్ బాక్సింగ్ జట్టుకు ఎంపిక కావడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాడు. బలగలోని జంగమ వీధిలో నివాసముంటున్న భార్గవ్ తండ్రి గంధం వీర కుమార్ పురోహితుడు, తల్లి పుష్పలత గృహిణి. పురోహితమే వీరి జీవనాధారం. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇద్దరు పిల్లలు డిల్లేశ్వర్, భార్గవ్ ఆటలపై ఆసక్తి పెంచుకున్నారు. ఇద్దరూ డీఎస్ఏ బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు వద్ద శిక్షణ పొంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

ఇండియన్ క్యాంప్‌కు ఎంపిక..

భార్గవ్ 2019లో బాక్సింగ్‌లో ప్రవేశం పొందాడు. కోవిడ్‌తో టోర్నీలు లేక.. ప్రాక్టీసుకే పరిమితమయ్యాడు. 2022లో విశాఖపట్నంలో జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో రజత పతకం, ఆ తర్వాత వరుసగా 2023 రాజమండ్రిలో, 2024లో విశాఖపట్నంలో జరిగిన స్టేట్‌మీట్‌లో బంగారు పతకాలు సాధించాడు. తాజాగా



బాక్సింగ్ సాధనలో..

విశాఖపట్నంలో జరిగిన జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లోఅద్భుతంగా రాణించి బంగారు పతకంతో మెరిశాడు. బాక్సింగ్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో హర్యానాలోని రోతక్‌లో జూలై 18 నుంచి 24 వరకు జరిగిన ప్రతిష్టాత్మక 6వ జూనియర్ నేషనల్స్ బాక్సింగ్ మీట్‌లో 80–85 కేజీల విభాగంలో కాంస్య పతకంతో మెరిశాడు. ఫైనల్ బెర్త్ కోల్పోయినా సెలక్టర్లను ఆకర్షించి ఇండియన్ క్యాంప్‌కు ఎంపికయ్యాడు. హర్యానాలోని రోతక్ వేదికగా శిక్షణ ముగించుకుని జిల్లాకు తిరుగుముఖం పట్టాడు. అక్టోబర్‌లో మరోసారి జరిగే ఇండియన్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొనాలని బీఎఫ్ఐ ఎన్ఐసీ కోచ్‌లు సూచించినట్టు భార్గవ్ చెబుతున్నాడు. భార్గవ్ ప్రస్తుతం ఇంటర్మీడియెట్ సెకెండియర్ చదువుతున్నాడు. భార్గవ్‌ను బాక్సింగ్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్‌దేవ్, వంగా మహేష్, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, జిల్లా బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు అభినందించారు.

అందరి ప్రోత్సాహంతో..

తల్లిదండ్రులు, అన్నయ్య స్ఫూర్తితో బాక్సింగ్‌లో ప్రవేశం పొందాను. కోచ్ ఉమామహేష్, సంఘ పెద్దలు, కాలేజ్ ఫ్యాకల్టీ ప్రోత్సాహంతో నిరంతరం సాధన చేస్తున్నాను. నేషనల్ మెడల్ సాధించి, ఇండియన్ కోచింగ్ క్యాంప్‌కు ఎంపికైనందుకు గర్వంగా ఉంది. భారత జట్టుకు ఎంపిక కావడం, ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించడమే నా జీవిత ఆశయం.

– గంధం సత్యభార్గవ్, బాక్సింగ్ ప్లేయర్

క్లుప్తంగా

హైకోర్టు జడ్జి ఇంట సందడి



హైకోర్టు జడ్జిని కలిసి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరఘట్టం: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి గేదెల తుహిన్‌కుమార్ ఇంట వద్ద శనివారం సందడి నెలకొంది. ఆయన హైకోర్టు జడ్జిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి ఆయన స్వగ్రామమైన వీరఘట్టం మండల కత్తులకవిటి గ్రామానికి వచ్చారు. దీంతో ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపేందుకు స్థానిక నేతలు, అధికారులు క్యూ కట్టారు. హైకోర్టు జడ్జిగా ఈ ప్రాంతానికి చెందిన మీరు ఉండడం మాకు ఎంతో గర్వకారణంగా ఉందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. జడ్జి తుహిన్‌కుమార్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే వీరఘట్టం, పాలకొండ, రేగిడి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సూర్యప్రకాశరావు, డి.వెంకటరమణనాయుడు, కర్రి గోవిందరావు, పొట్నూరు లక్ష్మణరావు తదితరులు కలిశారు. వీరఘట్టం తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు తదితరులు జడ్జిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసుల అదుపులో పొట్టేళ్ల పందెంరాయుళ్లు



పోలీసుల అదుపులో పందెంరాయుళ్లు

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామ శివారులో పొట్టేళ్ల పందెం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ పి.రమేష్ నాయుడు శనివారం తెలిపారు. ఉల్లిభద్ర గ్రామ శివారులో పొట్టేళ్ల పందెం నిర్వహిస్తున్న ప్రదేశంలో దాడులు చేసి వీరిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. రెండు పొట్టేళ్లను, రూ.1680 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడిన ఆరుగురిపై కేసు నమోదు చేసి పార్వతీపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు.

నూతన బార్ పాలసీ విడుదల

విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్లు 275, 276 ప్రకారం 2025-2028 సంవత్సరాలకు సంబంధించి నూతన బార్ పాలసీలను విడుదల చేసినట్టు జిల్లా మద్యనిషేధ, అబ్కారీ శాఖ అధికారి బి.శ్రీనాథుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీ, నగర పంచాయతీలలో గల 282బి బార్స్ నోటిఫై చేశామన్నారు. వీటిలో మూడు టూబి బార్స్ కల్లు గీత కులాలకు కేటాయించామన్నారు. ఈ వేలం ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అదే విధంగా పార్వతీపురం మన్యం జిల్లాలో మున్సిపాలిటీ, నగర పంచాయతీలో ఎనిమిది 2బి బార్స్‌ను నోటిఫై చేశామన్నారు. వాటిలో రెండు 2బి బార్స్ కల్లుగీత కులాలకు కేటాయించామన్నారు. ఆసక్తి గలవారు వారి పరిధిలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌లలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 9440902360, 9440902362 (విజయనగరం), 8348523855, 9398630486 (పార్వతీపురం మన్యం) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేత్ర శస్త్ర చికిత్సకు 20 మంది ఎంపిక

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన నేత్ర వైద్య శిబిరానికి హాజరైన 180 మందిలో వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 20 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి హాజరైన ప్రతి ఒక్కరి కళ్లను వైద్య సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేసి, ఏవైనా సమస్యలుంటే చెప్పి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం, స్వామి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ సర్కిల్ పరిధిలోని విజయనగరం రూరల్, గంట్యాడ పోలీస్‌స్టేషన్‌ల సిబ్బందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు శనివారం చేసినట్లు విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. విజయనగరానికి చెందిన మ్యాక్సి విజన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారు వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

ఓటర్లను చైతన్యపరచడమే లక్ష్యం

శృంగవరపుకోట: ఓటర్లను చైతన్యపరచి వారికి తమ హక్కులు, విధులు, బాధ్యతలను తెలియచెప్పడమే లక్ష్యంగా ఓటరు అక్షరాస్యత వేదిక పని చేస్తోందని వేదిక అధ్యక్షుడు సూర్యారావు తెలిపా రు. ఓటరు అక్షరాస్యత వేదిక ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి స్థానిక లైబ్రరీలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వైద్యులు ఆర్.త్రినాధరావు, పి. వరలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఓవరాల్ విజేతలైన జి.భవిష్య, బి.తేజస్విని, బి.ఊహలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.శ్రీధర్, మోహన్‌రావు, చిన్నికృష్ణ, ఎల్.సాంబమూర్తి, తాతారావు, బి.అప్పారావు, పి.శ్రీనివాసరావు, మేఘన, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి వదల్లేరు..
బతుకు చక్రం కదలట్లేదు..!

- వినాయక విగ్రహాలకు డిమాండ్ తగ్గడంతో కుమ్మరుల్లో ఆందోళన
- బతుకు భారమైందంటూ ఆవేదన
- ఆదుకోని కూటమి ప్రభుత్వం



వినాయక విగ్రహాల తయారీలో వృత్తిదారులు

సాలూరు: మరో పది రోజుల్లో వినాయకచవితి పండగ రానుంది. ఈ క్రమంలో ఇప్పటికే కుమ్మరి వీధులన్నీ సాధారణంగా వినాయక విగ్రహాల తయారీతో హడావిడిగా ఉండాలి. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి కుమ్మరి వీధుల్లో కనిపించడం లేదు. రథయాత్ర తరువాత ప్రారంభించే ఈ విగ్రహాల తయారీకి రెండు నెలల ముందు నుంచే సాలూరు, ఒడిశా పరిసర ప్రాంతాల నుంచి వినాయక కమిటీ నిర్వాహకులు వచ్చి భారీ పరిమాణంలో, వివిధ ఆకృతుల్లో వినాయక ప్రతిమల తయారీకి ఆర్డర్‌లు ఇచ్చేవారు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదని కుమ్మరులు వాపోతున్నారు. పెద్దబొమ్మలు ఆర్డర్‌లు చాలా వరకు తగ్గాయని, ఆ భయంతో గతంతో పోలిస్తే తక్కువ సంఖ్యలోనే బొమ్మలను తయారు చేస్తున్నట్టు తయారీదారులు తెలిపారు.

సాలూరు, పాచిపెంట పండగల ఎఫెక్ట్

ప్రతి ఏడాది వినాయక ఉత్సవాన్ని చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఐక్యంగా స్థాయి కొద్దీ మండపాలు ఏర్పాటు చేసుకుని ఘనంగా పూజలు, అన్న సమారాధనలు, అనుపోత్సవం చేస్తుంటారు. ఈ ఏడాది సాలూరు, పాచిపెంట గ్రామదేవతల పండగలు జరగడంతో ప్రజల వద్ద చాలా వరకు డబ్బుల్లేవని దీనితో ఈ ఏడాది వినాయక ప్రతిమల ఆర్డర్‌లు తగ్గాయని కుమ్మరులు చెబుతున్నారు. వినాయకుడిని పెట్టిన తరువాత అన్న సమారాధన, అనుపోత్సవాలకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల వద్ద డబ్బులు లేకపోవడంతో నిర్వాహకులు కొంత వెనుకంజ వేస్తున్నారని వారు పేర్కొంటున్నారు.

పెరిగిన తయారీ ఖర్చు

బొబ్బిలి నుంచి తీసుకువచ్చే ట్రాక్టర్ మట్టికి కుమ్మరులు సుమారు 3500 రుపాయిలు చెల్లిస్తున్నారు. తయారీలో భాగంగా ముడి సరుకులు, రంగులకు అధిక డబ్బులు ఖర్చవుతున్నాయి. ఇంత డబ్బులతో తయారు చేస్తున్న వినాయక విగ్రహాలు కొనుగోలు జరగకపోతే ఇబ్బందులు పడతామని కావున గతంతో పోలిస్తే తక్కువ సంఖ్యలోనే ఈ ఏడాది వినాయక విగ్రహాలు తయారీచేస్తున్నామని కుమ్మరులు చెబుతున్నారు. రూ.లక్షలు పెట్టి తీసుకువచ్చిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన పెద్ద విగ్రహాలకు ఇంకా ఆర్డర్లు రాకపోవడంతో ఆందోళన నెలకొందని తయారీదారులు వాపోతున్నారు.

పంటల్లేవు.. పథకాల్లేవు..

ప్రజలకు గత ప్రభుత్వంలో ప్రతి నెలా ఏదో ఒక పథకం కింద డబ్బులు వారి ఖాతాల్లో జమవ్వడంతో ఆ డబ్బులు వారికి ఇటువంటి పండగలు, ప్రత్యేక కార్యక్రమాలకు ఉపయోగపడేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పథకాలు లేక ప్రజల వద్ద డబ్బులు కొరత నెలకొందని చర్చించుకుంటున్నారు. మరోవైపు పంటల పరిస్థితులు కూడా అనుకున్నంత సానుకూలంగా ఏమీ లేకపోవడంతో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితుల్లో పండగ వైపు పెద్దగా దృష్టి సారించడం లేదు.

కుమ్మరి చక్రం కదలనంటున్నా....

కుమ్మరి వృత్తి తమ పూర్వీకుల నుంచి వస్తున్న సాంప్రదాయమని వారు చెబుతున్నారు. ఒకప్పుడు ఈ వృత్తి తమ కడుపు నింపేదని, నేడు ఆ పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి పాత్రల వినియోగం తగ్గిపోవడంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని చెబుతున్నారు. ఒకప్పుడు ఈ వృత్తే జీవనాధారంగా ఉండేదని, ప్రస్తుతం ఏడాదిలో రెండు నెలలు మాత్రమే ఈ వృత్తి కడుపు నింపుతోందని వారు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా కుమ్మరి చక్రం కదలనంటున్నా.. తమ కుల వృత్తిని వదులుకోలేకపోతున్నామని, ప్రభుత్వం తమకు చేదోడువాదోడుగా నిలవాలని వారు కోరుతున్నారు.



వినాయక విగ్రహాల తయారీలో వృత్తిదారులు

రెండు ద్విచక్ర వాహనాల దగ్ధం



టీకే రాజపురంలో దగ్ధమైన ద్విచక్ర వాహనాలు

పాలకొండ రూరల్: మండలంలోని టీకే రాజపురం గ్రామస్తులు శుక్రవారం పాలకొండ పోలీసులను ఆశ్రయించారు. తమ గ్రామానికి చెందిన జాడ దుర్గారావు అలియాస్ చిన్న అనే వ్యక్తి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని వాపోయారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పెద్దింటి సూరిబాబుకు చెందిన ఎక్సెల్ వాహనంతో పాటు దోర భానుప్రసాద్‌కు చెందిన డీలక్స్ ద్విచక్ర వాహనం దగ్ధం చేశాడని ఎస్‌ఐ కె.ప్రయోగమూర్తి వద్ద వాపోయారు. గ్రామస్తుల ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని అదుపులోకి తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

భవనం పైనుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతుడు గురజాపు అప్పారావు

మెంటాడ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనం పిట్ట గోడ నిర్మాణంలో పని చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్రంగా గాయపడి అనంతరం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ కె.సీతారాం శనివారం అందించిన వివరాలు.. మెంటాడ మండల కేంద్రంలో నిర్మితమవుతున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణం జరుగుతుంది. దానికి సంబంధించి పిట్టగోడ నిర్మాణం జరిగే సమయంలో శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం అదపాకకు చెందిన గురజాపు అప్పారావు(32) ప్రమాదవశాత్తూ జారి పడి గాయపడినట్టు ఎస్‌ఐ తెలిపారు. చికిత్స నిమిత్తం గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని సర్వజన ఆసుపత్రికి తరలించినట్టు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



బలరాంనాయుడు(ఫైల్)

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన ఆయకట్టు సంఘం చైర్మన్ ఈదిబిల్లి బలరాంనాయుడు వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురై మూడు రోజుల కింద పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విజయనగరం ఎంఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బలరాంనాయుడు(62) మృతి చెందినట్టు పోలీసులు శనివారం తెలిపారు. మృతుడి భార్య ఈదుబిల్లి అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్‌ఐ ఎం.రాజేష్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లారీ డ్రైవర్..

భోగాపురం: వీరాస్వామి అనే లారీ డ్రైవర్ విజయవాడ నుంచి వస్తూ సుందరపేట హైవే జంక్షన్ వద్ద యూ టర్న్ తీసుకుని భోగాపురం అన్నపూర్ణ హోటల్ సమీపంలో శనివారం లారీని కాసేపు ఆపాడు. తరువాత లారీ కింద మృతి చెంది కనిపించాడు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కుంభ జోవేష్ అనే వేరే లారీ డ్రైవర్ వీరాస్వామి మృతి చెందినట్టు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సీఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి డ్రైవర్ వీరాస్వామి గుండెపోటుతో మరణించాడా? వేరే ఏవిధంగానైన మరణించాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్ : అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం జీఆర్‌పీ పోలీసులు శనివారం గుర్తించారు. 50 సంవత్సరాల వయసు ఉండే ఈ వ్యక్తి తెలుపు రంగు కట్ బనియన్, ఖాకీ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, రైలు నుంచి జారి పడి ఉండొచ్చని భావిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రాత్రి సమయంలో జారి పడడంతో తలకు తీవ్ర గాయాలై ఉండొచ్చని జీఆర్‌పీ ఎస్‌ఐ బాలాజీరావు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన వారు 9490617089, 830990038, 9491813163 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య



ఉరి వేసుకొని మృతి చెందిన రామునాయుడు

దత్తిరాజేరు: మండలంలోని దాసరిపేట గోపినాధ పట్నాయక్ చెరువు గట్టుపై మెంటాడ మండలం మీసాలపేట గ్రామానికి చెందిన మహంతి రామునాయుడు(55) ఉరి వేసుకొని మృతి చెందినట్టు పెదమానాపురం ఎస్‌ఐ జయంతి శనివారం తెలిపారు. పొలం పనులకు వెళ్తానని ఇంటి వద్ద చెప్పి దాసరిపేట చెరువు గట్టుపై మృతి చెందడంతో బంధువుల ద్వారా సమాచారం తెలియడంతో కుటుంబంలో ఒక్కసారి విషాదం నెలకొంది. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. మృతుడికి వివాహం అయిన కుమార్తెతో పాటు కుమారుడు, మరో కుమార్తె ఉన్నారు.

18 నుంచి ఆలా హజరత్ ఉత్సవాలు

విజయనగరం టౌన్: దేశ వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ ఆలా హజరత్ ఉత్సవాలను సున్నీ మసీదుల్లో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు పట్టణ శాఖ ముస్లింల ప్రతినిధి మహమ్మద్ గౌస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట, కురుపాం, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న మసీదుల్లో ఉరుసు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఆబాద్ వీధిలో ఉన్న మదరసా ఆల్ జామియాతుల్ హబీబియా అహ్మదీయా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్సవ ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భారీ అన్న సమారాధన ఉంటుందని తెలిపారు.


స్పా సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు



స్పా సెంటర్ రికార్డులు పరిశీలిస్తున్న సీఐ చౌదరి, ఎస్‌ఐ సురేంద్రనాయుడు

విజయనగరం క్రైమ్: నగరంలోని ఏడు స్పా(మసాజ్) సెంటర్లలో వన్‌టౌన్ పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మసాజ్ సర్వీసుకు వచ్చే స్త్రీ, పురుషులను వేర్వేరుగా ఉంచాలని సీఐ ఆర్‌వీకే చౌదరి నిర్వాహకులకు సూచించారు. డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సీఐ చౌదరి, ఎస్‌ఐలు రామ్‌గణేష్, లక్ష్మీప్రసన్నకుమార్, సురేంద్రనాయుడులు మసాజ్ కేంద్రాలకు వెళ్లి, పరిశీలించారు. తప్పనిసరిగా కేంద్రంలో అర్హులైన ఫిజియోథెరపిస్ట్‌లు ఉండాలన్నారు. రాత్రి వేళల్లో స్పా సెంటర్‌లకు అనుమతి లేదని, ఎవరూ నిర్వహించవద్దన్నారు.

అక్రమంగా పశువుల తరలింపు



అంతర్రాష్ట్ర రహదారిపై పశువుల అక్రమ రవాణా

కొమరాడ: ఒడిశా నుంచి పార్వతీపురం సంతకు కొమరాడ మీదుగా జాతీయ రహదారిపై మూగజీవాల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతుంది. బొలెరా వంటి వాహనాల్లో వందల సంఖ్యలో పశువులను అక్రమంగా తరలించేస్తున్నారు. వీటి రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం ఏమీ చూడనట్టు వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. వీటిని కబేళాలకు తరలిస్తున్నట్టు అధికార యంత్రాంగానికి తెలిసినా ఏమీ పట్టనట్టు వ్యవహరించడంపై దుమారం రేగుతోంది. అంతర్రాష్ట్ర ప్రధాన రహదారిపై వందలాది పశువులను తరలిస్తూ అక్రమ సంపాదనపై అక్రమార్కులు గురి పెట్టినా నిఘా వర్గాలకు ఏమీ పట్టడం లేదు. మరోవైపు వందలాది కిలోమీటర్ల పొడవునా వీటిని నడిపిస్తూ కూడా కబేళాలకు తరలిస్తున్నా ఇటు పోలీసులకుగాని, అటు జంతు సంక్షేమ సంఘాలకు అనుమానం కలగకపోవడం విశేషం. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మొద్దు నిద్రను వీగి మూగజీవాల పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

కనకాంబరాలతో కనక వర్షం



కనకాంబరాల తోట

- సాగుపై పెరుగుతున్న ఆసక్తి

భామిని: పూల సాగులో కనకాంబరాలది ఓ ప్రత్యేకత. గ్రామీణ ప్రాంతాల్లో వాడంబారాలుగా పిలవబడే వీటిని కనకాంబరాలగానే పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తారు. ఏడాది పొడవునా పూలు పూస్తూ సాగుదారులకు మంచి ఆదాయాన్ని తెచ్చి పెడతాయి. వీటిని ఒకసారి నాటితే మూడేళ్ల వరకు దిగుబడినిచ్చి సాగుదారులకు పుష్కలంగా ఆదాయాన్ని అందిస్తాయి. ఈ పూలు వాసన లేకున్నా వివిధ రంగుల్లో మహిళలను ఆకర్షిస్తాయి. అదే సమయంలో వివిధ శుభకార్యాల్లో వీటికున్న ప్రత్యేకత వేరు. వీటిని స్త్రీల శిరోజాల అలంకరణతో పాటు శుభ కార్యాల్లో వేర్వేరు రూపాల్లో అలంకరించి ఆదాయాన్ని పొందుతారు. ఇవి ఎక్కువగా ఆరంజ్, ఎల్లో, ఎరుపు రంగుల్లో పూస్తాయి. మార్కెట్‌లో ఈ రకాలకు మంచి డిమాండ్ ఉండడంతో పాటు గిట్టుబాటు ధరలు వస్తుండడంతో రైతులు వీటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. కొబ్బరి, మామిడి తోటల్లో అంతర పంటలుగా కూడా వీటిని సాగు చేయవచ్చని చెబుతున్నారు. పాలకొండ నియోజకవర్గంలో భామిని, వీరఘట్టం, పాలకొండ మండలాల్లో వీటి సాగు ఎక్కువగా ఉంది. స్థానికంగా వీటిని విక్రయించడంతో పాటు దూర ప్రాంతాలకు ఎగుమతి కూడా చేస్తున్నారు. పాతపట్నం, టెక్కలి, ఒడిశాలోని పర్లాకిమిడి, గుణుపూర్ ప్రాంతాలకు రోజూ రవాణా చేస్తున్నారు. మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

ఈ సీజన్‌లోనే...

ప్రస్తుతం కనకాంబరాలు నాటుకొనే సమయంగా రైతులు చెబుతున్నారు. ఏటా జూలై – ఆగస్టు నెలల్లో కొత్తగా తోటలు నాటుకుంటారు. రెండు నెలలుగా నారు పోసి సంరక్షించుకుని ఆ నారును మెట్టు భూముల్లో వేస్తారు. నాణ్యమైన నారు కోసం రామభద్రపురం, సాలూరు, రాజమండ్రి నర్సరీల నుంచి దీన్ని తెస్తున్నారు. అధిక తేమ, వేడి కలిగిన నేలల్లో సాగుకు ఇది అనుకూలం. చల్లని వాతావరణ పరిస్థితుల్లో అధిక దిగుబడినిస్తాయి. నీరు నిలువ లేని అన్ని రకాల నేలలు వీటి సాగుకు అనుకూలం.

విత్తన తయారీ..

విత్తనం, కాండపు మొక్కల ద్వారా ప్రవర్ధనం చేసుకోవచ్చు. అధిక దిగుబడినిచ్చే రకాలను విత్తనాల ద్వారా తయారు చేస్తారు. ఎకరానికి రెండు కిలోల విత్తనం అవసరం. నిల్వ చేసిన విత్తనం మొలకెత్తే శాతం తక్కువ. అప్పుడే పూల గుత్తిల నుంచి వేరు చేసిన విత్తనాలను సిద్ధం చేసుకోవచ్చు. ఒక మీటరు పొడవు, 15 సెంటీమీటర్ల ఎత్తు గల నారుమడులు సిద్ధం చేసి నారు వేసుకోవాలి. మొక్కలు 4 నుంచి 6 ఆకులు వేసిన 50 నుంచి 60 రోజుల్లో నారును తీసి నాటుకోవచ్చు. నీటి ఎద్దడిని తట్టుకొంటుంది. అయినా అవసరాన్ని బట్టి 10 నుంచి 15 రోజులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వారానికి ఒకసారి అందించాలి. డ్రిప్ పద్ధతిలో అయితే 4 లేదా 5 రోజులకు ఒకసారి నీరు పెట్టాలి.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



మొక్కలు పెరిగే దశలో కలుపు లేకుండా చూడాలి. వేసవిలో ఎండ తీవ్రతను తగ్గించడానికి అవిసె మొక్కలు పెంచితే పాక్షిక నీడ ఏర్పడి మొక్కలు బాగా పెరిగి అధిక పూల దిగుబడి వస్తుంది. పూలు కోసిన తరువాత పూల గుత్తిలను, ఎండు కొమ్మలను తొలగిస్తే ఏడాది పొడవునా పూల దిగుబడి పెరుగుతుంది. మొక్కలు నాటిన రెండు లేక మూడు నెలలకు పూత వస్తుంది. జూన్ నుంచి జనవరి వరకు పూత బాగా ఉంటుంది. వర్షాకాలంలో దిగుబడి తగ్గుతుంది. రెండు రోజులకు పూలు విచ్చుకొంటాయి. ఉదయం లేదా సాయంకాలం మాత్రమే పూలు కోయాలి.

– కొల్లి తిలక్, వ్యవసాయాధికారి, భామిని


కన్యాశుల్కం ప్రదర్శన పూర్వజన్మ సుకృతం



దర్శకులు ఈపు విజయకుమార్‌తో ప్రశంసపత్రాలు అందుకున్న కన్యాశుల్కం మహిళల బృందం

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ కలం నుంచి జాలువారిన కన్యాశుల్కం నాటకాన్ని 60 ఏళ్లకు పైబడిన మహిళలతో రవీంద్రభారతిలో ప్రదర్శించడం పూర్వజన్మ సుకృతమని దర్శకులు ఈపు విజయకుమార్ పేర్కొన్నారు. మహాకవి స్వగృహంలో శనివారం సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయసూర్య ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కన్యాశుల్కంలోని బొంకులదిబ్బ సీన్, మధురవాణి ఇల్లు–మంచం సీన్, అగ్నిహోత్రవధాన్లు ఇల్లు – తాంబూలాల సీన్, సౌజన్యరావు పంతుల ఇల్లు (డామిట్ కథ అడ్డం తిరిగింది సీన్)ను కేవలం వయోవృద్ధులైన మహిళలతో విజయవంతంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ నెల 12న రవీంద్రభారతిలో అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్–2025లో కన్యాశుల్కం ప్రదర్శించి ఆహుతుల మన్ననలు పొందామన్నారు. గాంధీ జ్ఞానప్రతిష్ఠాన్ చైర్మన్ డాక్టర్ గున్నా రాజేంద్రరెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ బి.సత్యానందం, సినీన టి, సంఘసేవకురాల కరాటే కల్యాణి, అభినయ శ్రీనివాస్ తదితరుల చేతుల మీదుగా ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నామన్నారు. భోగరాజు సూర్యలక్ష్మి నిర్వహణ బాధ్యతలతో పాటూ గిరీశం పాత్రధారిలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చి ఆహుతుల మన్ననలు పొందారన్నారు. వీరితో పాటూ మధురవాణిగా ఎ.సీతామహాలక్ష్మి, కరటకశాస్త్రిగా ముళ్లపూడి సుభద్రాదేవీ, అగ్నిహోత్రవధానులుగా కుమారి సామవేదుల గీతారాణి, వెంకటమ్మగా ఉదయగిరి నీలిమ, రామప్పపంతులుగా సిహెచ్.రాజకుమారి, బుచ్చమ్మగా పూటకూళ్లమ్మ, ఫోటోగ్రఫీ పంతులు నౌకరుగా సామవేదుల సత్యలత, సౌజన్యరావు పంతులుగా చీకటి చంద్రికారాణిలు పాత్రోచితమైన ప్రదర్శన చేసి ఆహుతుల కరతాళ ధ్వనులందుకున్నారని తెలిపారు. శ్రీకాకుళానికి చెందిన ఎస్.రమణ రంగాలంకరణ, రూపాలంకరణ చేశారన్నారు. ఈ సందర్భంగా కన్యాశుల్కం నాటక ప్రదర్శనకు తోడ్పాటునందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భోగరాజు సూర్యలక్ష్మి, సుభద్రాదేవీ, కన్యాశుల్కం టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

గురజాడ సాహిత్య సంపద, స్మారక భవనాన్ని కాపాడాలి



గురజాడ విగ్రహం వద్ద ఘన నివాళులర్పిస్తున్న పౌర వేదిక సభ్యులు

విజయనగరం గంటస్తంభం: మహాకవి గురజాడ అప్పారావు స్మారక భవనం గురించి జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలకూ, మంత్రులకూ పట్టకపోవడం శోచనీయమని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు. గురజాడ రచనలను భద్రపరచాల్సిన ఆర్కియాలజీ విభాగం, రాష్ట్ర టూరిజం శాఖ పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా గురజాడ గృహాన్ని, గురజాడ సాహిత్యాన్ని కాపాడటంలో పూర్తిగా విఫలమవుతున్నారు. గురజాడ గృహంలో గురజాడకి శనివారం ఘన నివాళులు అర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గురజాడ అప్పారావు ఇంటిలో తాగుబోతు హాల్ చల్ చేసి, సాహిత్య సంపాదని, వస్తువులను చిందరవందర చేసినా అధికార పార్టీకి చెందిన నాయకులు ఎవరూ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత, విజయనగరం జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లాలోని ఎమ్మెల్యేలుగాని గురజాడ ఇంటిని సందర్శించడానికి కూడా తీరిక కల్పించుకోలేని పరిస్థితిలో ఉండడం పట్ల ఆయన మండిపడ్డారు. తెలుగు సాహిత్యాన్ని ప్రపంచం నలుమూలలకి పంపి సుసంపన్నం చేసిన గొప్ప వ్యక్తికి మన నేతలు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గురజాడ అప్పారావు సాహిత్య సంపదకు, గురజాడ స్మారక భవనానికి తగిన రక్షణ కల్పించాలని భీశెట్టి కోరారు. పౌర వేదిక కార్యనిర్వాహక అధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, సహాయ కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.